క్లుప్తంగా

సమాధుల తోటలను శుభ్రం చేయండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణ పరిధిలోని చినరావూరు, ఐతానగర్, గురవయ్య కాలనీల్లోని సమాధుల తోటల్లో పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని పలు సమాధుల తోటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈస్టర్ పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో క్రైస్తవులు పూర్వీకులను స్మరించుకుంటారని తెలిపారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకునే విధంగా ఆయా ప్రాంతాలను తీర్చిదిద్దాలని చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, దావులూరి శ్రీనివాసరావు, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మాజీ ఆర్మీ జవాను మృతి

తెనాలిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మాజీ ఆర్మీ జవాను మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట రవికిరణ్ (56) ఆర్మీలో పని చేసి రిటైరయ్యారు. ఈ నెల 15న తెనాలి మార్కెట్ సెంటరులో నిలబడి ఉండగా బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. వైద్యశాల నుంచి మంగళవారం వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

మద్యం విక్రేతలపై కేసు నమోదు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసులు నమోదు చేశారు. తెనాలి మండలం కొలకలూరు, దుగ్గిరాల మండలం ఈమని గ్రామాల్లో ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇద్దరు వ్యక్తులు మద్యం విక్రయిస్తుండటాన్ని గుర్తించి పరిశీలించారు. ఇద్దరి వద్ద 28 సీసాలు లభించడంతో వాటిని స్వాధీన పర్చుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఫిరంగిపురం: వాతావరణంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో బుధవారం పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖాధికారి వాసంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం పడే అవకాశం ఉండటంతో మిర్చి కోతలు, జొన్న, శనగ పంటల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని రాజాపేటలో పునీత ఆంథోని ఆలయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. దివ్యపూజా బలి కార్యక్రమం నిర్వహించారు. బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి వాక్యోపదేశం చేస్తు ప్రతి ఒక్కరూ భగవంతునిపై విశ్వాసంతో మెలగాలని చెప్పారు. భక్తులకు అన్నదానం చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యుడు మున్నంగి జోజప్ప, సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా మల్లు స్వరాజ్యం వర్ధంతి



తాడేపల్లిరూరల్: తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని ఐద్వా కార్యాలయంలో నిర్వహించారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం 14 సంవత్సరాలకే భూమి కోసి, భుక్తి కోసం పోరాటం చేశారని, ఆడపిల్లలు కర్రలు చేత పట్టుకుంటే సమస్యలన్నీ పారద్రోలవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు సుధ, శ్రీనివాస కుమారి, గిరిజ, పార్వతి, రమణమ్మ పాల్గొన్నారు.

సంచార జాతుల శ్రేయస్సుకు సీఎం జగన్ కృషి

మొండిబండ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: రాష్ట్రంలో సంచార జాతుల కులస్థులకు రాజకీయ అవకాశం కల్పించినది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో మంగళవారం మొండిబండ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీసీ నాయకుడు కొడాలి క్రాంతికుమార్ అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ ప్రసాదం సురేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో సుమారు రెండు వేల మంది మొండి బండ కులస్థులు ఉన్నారని, 85 శాతం కుటుంబాలు ప్రభుత్వం ద్వారా సంక్షేమ ఫలాలు అందుకున్నారని తెలిపారు. బీసీ కులస్థుల జీవన ప్రమాణాలు పెంచే విధంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేశామన్నారు. నాలుగున్నర ఏళ్లలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సంక్షేమ సారథి జగన్ మోహన్‌రెడ్డి, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాల గురవమ్మ, గ్రామ పార్టీ కన్వీనర్ ప్రసాదం సురేష్, మొండి బండ నాయకులు కమాదుల రాజేష్, కమాదుల ముత్యాలు, ప్రసాదం రాధారావు, బూసి మాధవ్, రాంబాబు, పార్టీ నాయకులు కార్తికేయ, పినపాటి అనిల్, మల్లవరపు విజయ్, భరత్, పెసర్లంక రమణ, అక్కిదాసు కిరణ్, అశోక్ యాదవ్, కాళిదాసు వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంతో సుస్థిర సమాజం

మున్సిపల్ కమిషనర్ శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలి అర్బన్: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ ఉపయోగించుకునే విధంగా అందరిలో చైతన్యం తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, మెప్మా, సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో నూతనంగా ఓటు హక్కు పొందిన వారిని గుర్తించాలని సూచించారు. వారందరూ ఓటు వేసే విధంగా చూడాలన్నారు. ఇందుకోసం పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఓటింగ్ శాతం పెరిగే విధంగా అందరూ చూడాలన్నారు. యువతలో ఓటు హక్కు పై అవగాహన తెచ్చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఓటు హక్కు వజ్రాయుధమని దానిని అంతా సక్రమంగా ఉపయోగించుకుంటే మంచి పాలకులను ఎన్నుకోవచ్చని వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యం ఉందనే విషయాన్ని అందరికీ తెలియజేయాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ అనూష మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారికి ప్రభుత్వం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. దానిని బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఓటు హక్కును యువత పొందడం దానిని ఉపయోగించడం ఎంతో ముఖ్యమని చెప్పారు. సమావేశంలో ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం

ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



ఎన్నికల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక

తెనాలి అర్బన్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు అంతా ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. 30వ వార్డులో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొమ్మరబత్తిన జయపాల్, 30వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం

తూములూరు(కొల్లిపర): ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్ కోరారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తూములూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలో స్థానిక నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్ల యోగ క్షేమాలు అడిగి తెలుసుకొని వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు ఉయ్యూరు ఉమా మహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్ రెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ బద్దిగం శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి , మండల ఉపాధ్యక్షులు అద్దంకి బోసుబాబు, పార్టీ నాయకులు కొల్లి రాఘవరెడ్డి, బేతాల భూషణం, కనపర్తి ప్రకాశ్, ఆరుమళ్ల శివారెడ్డి, వంగా సుధాకర్‌రెడ్డి , భీమవరపు శివకోటిరెడ్డి, పిల్లి గంగాధర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెదరావూరులో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: రూరల్ మండలం పెదరావూరు గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం ముమ్మరంగా కొనసాగుతోంది. గ్రామంలోని మహిళలు, యువకులు ఆయనకు ఘన స్వాగతం పలుకుతున్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కిలారి రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు రావూరి ఏసుబాబు, కుదరవల్లి శంకరరావు, కాకి మనోజ్, రావూరి విజయ్, సిరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

తెనాలిటౌన్: పట్టణంలోని అమరావతి ప్లాట్స్‌లో బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డీఈఈ బి.ఆశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి క్రిస్టియన్ పేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి మంగళవారం తెనాలి సబ్ డివిజన్ ఎస్సీ, ఎస్టీ, విజువల్ కమిటీ మెంబర్ బుల్లా రాజారావు, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ వికలాంగుల విభాగం జిల్లా ఉపాధ్యక్షులు బొక్క అగస్టిన్, ప్రధాన కార్యదర్శి వేమూరి వందనం తాడేపల్లి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, గుంటూరు జిల్లా జేసీఎస్ అధ్యక్షులు ఈదులమూడి డేవిడ్‌రాజులను మర్యాద పూర్వకంగా కలిశారు. వీరిని నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ముదిగొండ ప్రకాష్, నాయకులు కురగంటి ఉదయరాజు, బేతం భాస్కర్ పాల్గొన్నారు.

దుగ్గిరాలలో పోలీస్ కవాతు



తాడేపల్లిరూరల్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతిఒక్కరూ సహకరించాలని దుగ్గిరాల ఎస్ఐ మహేంద్ర సూచించారు. మంగళవారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలపై, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతి ప్రాంతంలో కవాతు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రసాద్, సురేష్, శివాజి, హెడ్ కానిస్టేబుల్ హసీన్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ

ఫిరంగిపురం: ప్రమాదవశాత్తు సరుకులోడుతో వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీకొని పూర్తిగా ధ్వంసమైన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. విజయవాడ నుంచి చేపలసీడ్‌తో వినుకొండ వెళ్తున్న లారీ ఫిరంగిపురంలోని బస్టాండు సమీపంలో ముందు ఉన్న చెత్త ట్రాక్టర్‌ను తప్పించబోయి డివైడర్ ఢీకొంది. ఈ ఘటనలో లారీ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. డ్రైవర్ సుబ్బారావుకు స్వల్పగాయాలయ్యాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం లేదు.

టోల్‌గేట్ వద్ద నిరంతరం తనిఖీలు

మంగళగిరి: ఎన్నికల నేపథ్యంలో కాజ టోల్ గేట్ వద్ద ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేయనున్నట్లు నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ కోరారు. మంగళగిరి నగర పరిధిలోని కాజ టోల్‌గేట్ వద్ద ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఎన్నికలకు నగదు, ఇతర వస్తువులు రవాణాను అడ్డుకోవడం కొరకు ప్రత్యేక చెక్‌పోస్టును ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులు తమతో తీసుకుని వెళ్లే నగదుతో పాటు వస్తువులకు తగిన ఆధారాలు ధ్రువీకరణపత్రాలతో వెళ్లాలని లేదంటే సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వెంకటరావు, ఎస్ఐ క్రాంతికిరణ్, కిషోర్ పాల్గొన్నారు.

టీసీఎస్‌కు ఎంపికైన ఏఎస్ఎన్ కళాశాల విద్యార్థులు

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఎంపికైన విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రఖ్యాత ఐటీ కంపెనీ టీసీఎస్‌కు ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్, బీసీఏ ఫైనలియర్ చదువుతున్న తొమ్మిది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని స్థానిక ఎమ్మెల్యే, ఏఎస్ఎన్ విద్యా సంస్థల చైర్మన్ అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. కళాశాలలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. క్యాంపస్ ఇంటర్వ్యూలు చేపట్టే టీసీఎస్ సంస్థ ఈ సారి జాతీయ స్థాయిలో డిగ్రీ విద్యార్థులకు స్మార్ట్ హైరింగ్ పద్ధతిని ప్రవేశ పెట్టిందన్నారు. దేశ వ్యాప్తంగా డిగ్రీ విద్యార్థులకు క్వాలిఫైర్ టెస్ట్‌ను నిర్వహించి అందులో అర్హత సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లో టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలను జరిపిందన్నారు. ఈ మొత్తం వడపోతలో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నుకున్న అతికొద్ది మందిలో తమ కాలేజీ విద్యార్థులు 9 మంది ఉద్యోగాలకు ఎంపికయినట్టు వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం ఇస్తున్న శిక్షణతోనే తమ విద్యార్థులు ఇంజినీరింగ్ విద్యార్థులతో పోటీపడి ఉద్యోగ అవకాశాలను పొందుతున్నట్టు చెప్పారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంగరాజు



మాట్లాడుతున్న ఆర్వో గంగరాజు, డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్

తాడికొండ: ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్‌తో కలసి వివిధ విభాగాల సిబ్బంది, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులోకి వచ్చిందని చెప్పారు. మైకు ద్వారా ప్రచారం, ర్యాలీలు, సభలు, పోస్టర్లు పంపిణీ ఇతర అన్ని కార్యకలాపాలకు ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయం, పోలీసు శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. అన్ని అనుమతులకు అభ్యర్థులు నేరుగా కార్యాలయానికి వచ్చే అవసరం లేకుండా సువిధ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్‌లైన్‌పై అవగాహన లేని వారు మాన్యువల్‌గా కూడా నేరుగా దరఖాస్తులను తాడికొండలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఇతర వివరాలకు హెల్ప్ డెస్క్ నంబర్లు 8074495632, 8125146794 సంప్రదించాలని సూచించారు. 24 గంటలు హెల్ప్ డెస్క్ కార్యాలయం అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్లు వేసే వరకు అభ్యర్థులు చేసే ఖర్చు ఇతర వివరాలు పార్టీ ఖర్చులలో నమోదు చేయబడుతుందని, నామినేషన్ల అనంతరం అభ్యర్థుల ఖాతాలో పడుతుంది కనుక అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి వారి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు.

ఫిరంగిపురం: ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ విమాదేవి మంగళవారం కోరారు. నిబంధనల ప్రకారం 72 గంటల్లోగా ప్రయివేటు ప్రాంతాల్లోని పార్టీ గుర్తులు ఉన్నచోట తెల్లరంగు వేయించామని చెప్పారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

తాడేపల్లి రూరల్: ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రాజకుమారి పేర్కొన్నారు. దుగ్గిరాల ఎంపీడీఓ కార్యాలయం నుంచి మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. చట్టప్రకారం వ్యాపార సముదాయాలు, ఇతర అంశాలపై రాజకీయ నాయకుల ప్రచార బోర్డులు తొలగించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ చట్టం 1955 సెక్షన్ 622 (2), 420, 421 ప్రకారం మున్సిపల్ కార్యాలయం నుంచి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 63, జీవో నంబరు 326 ప్రకారం వ్యాపారం నిమిత్తం మాత్రమే గ్లోబల్ బోర్డులు, గోడ పెయింటింగ్, గోడపత్రాలు తదితర వాటికి అనుమతి ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనల దృష్ట్యా చట్టం ప్రకారం రాజకీయ పార్టీలు ప్రచారం నిమిత్తం ఏర్పాటు చేసుకున్న గ్లోబల్ బోర్డు, గోడ పెయింటింగ్, గోడపత్రాలు అనుమతి లేదని, వాటిని ఆయా రాజకీయ పార్టీలు, ప్రజలు ఏర్పాటు చేసిన వాటిని వెంటనే తొలగించాలని ఆ ప్రకటనలో కోరారు.

కేఎల్‌యూలో జాతీయ స్థాయి ఫిల్మ్ ఫెస్టివల్



జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో జాతీయ స్థాయి చలన చిత్రోత్సవాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. సినీఫిలియా పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లలిత కళల విభాగాధిపతి సుభాష్ యలవర్తి మాట్లాడుతూ లలిత కళల విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి చలనచిత్రోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, లలిత కళల విభాగ విద్యార్థులకు సినిమా ప్రపంచంలోకి ఆకర్షణీయమైన ప్రయాణానికి నాంది పలికిందన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా యానిమేషన్ చిత్రం వాల్-ఇని ప్రదర్శించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, ఉద్యోగ కల్పనల డీన్ డాక్టర్ ఎస్.బి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆర్వో, నగర కమిషనర్ కీర్తి చేకూరి



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాజకీయ పార్టీల నాయకుల నుంచి అందిన ఫిర్యాదులను, అర్జీలను వెంటనే పరిష్కారించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం తన చాంబరులో ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పశ్చిమ నియోజకవర్గ ఆర్ఓ, అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఓటరు జాబితాపై ఓటర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన అర్జీలను, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారించాలన్నారు. ఎన్నికల నియమ నిబంధనలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ నెల 11 నుంచి 18వ తేదీ రెండు నియోజకవర్గాల్లో ఫారం 6, 7, 8లు, షిఫ్టింగ్ దరఖాస్తులు 3,529 అందాయని తెలిపారు. వాటిని 2 రోజుల్లో పరిష్కారించాలని ఆదేశించినట్లు చెప్పారు. ఏఈఆర్‌ఓలు వెంకటలక్ష్మి, సునీల్, సూపరింటెండెంట్‌లు ప్రసాద్, పద్మ, సెక్టోరల్ అధికారి శ్రీధర్, వైఎస్సార్ సీపీ నుంచి డి.జాని బాబు, టీడీపీ నుంచి ఓంకార్, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, అమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుంచి జాని బాషా, డిప్యూటీ తహసిల్దారు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే..కేసులు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తొలగించిన రాజకీయ పార్టీల పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు సరైన అనుమతులు లేకుండా తిరిగి ఏర్పాటు చేస్తే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలీసు కేసులు నమోదు చేయాలని మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం ఆదేశించారు. నగరంపాలెం, కన్నావారితోట, రైల్ పేట, నాజ్ సెంటరు, కొత్తపేట, వసంతరాయపురం, శారదా కాలని, సంజీవయ్య నగర్, నెహ్రూనగర్‌లోని పలు ప్రాంతాల్లో కోడ్ అమలుని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో తొలగించిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు సరైన అనుమతి లేకుండా కొందరు తిరిగి ఏర్పాటు చేస్తున్నారన్నారు. దీనిపై క్షేత్ర స్థాయి ఎంసీసీ అధికారులు నివేదిక ఇస్తున్నారని చెప్పారు. నగరంలో ఎక్కడైనా ఎంసీసీ ఉల్లం ఘనలను ప్రజలు గుర్తిస్తే నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కంప్లైంట్ సెల్‌కు లేదా 98499 08391 కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపితే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పర్యటనలో ఏఆర్ఓ సునీల్, భీమరాజు, ఎంసీసీ టీం అధికారి అనుపమ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షికోత్సవం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలో మార్కెట్ యార్డు వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం మంగళవారం శ్రీ సుదర్శన ఆరాధన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞ రుత్విక్కులు దీవి శ్రీమాన్ స్వామి, విఖనసాచార్య, ఆలయ అర్చకులు పరుచూరు మోహన శర్మ మాట్లాడుతూ దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం సుప్రభాత సేవ, శ్రీవారి అర్చన, యజ్ఞము, నీరాజన మంత్రపుష్పం, వేదపారాయణ కార్యక్రమాలు 16వ తేదీ నుంచి నిర్వహిస్తున్నామని మంగళవారం ఉదయం నిర్వహించిన శ్రీ సుదర్శన ఆరాధన కార్యక్రమంలో చుండూరు ఉమా మహేశ్వరరావు, వెంకట అనంత లక్ష్మి, కంభంపాటి క్రాంతి కుమార్, వనజ, అప్పారం శేషగిరి దంపతులు పాల్గొన్నారని చెప్పారు. సాయంత్రం సమయాన పారాయణం, శ్రీ లక్ష్మీ యజ్ఞం నిర్వహించామని తెలిపారు. చివరిరోజు బుధవారం స్వామి వారికి ఉదయం పూలంగి సేవ, విశేషార్చనం, నిత్య హవనం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కొంగర సుధీర్, కోనేరు మల్లిబాబు, గూడూరు వెంకటరావు, కంభంపాటి నరేంద్రకుమార్, చింతమనేని కొండయ్య, కొంగర జోగేంద్ర పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో సోషల్ వర్కర్ల పాత్ర కీలకం

ఏఎన్‌యూ: సమాజాభివృద్ధిలో సోషల్ వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని యూనివర్సిటీ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాధిపతి ఆచార్య వి.వెంకటేశ్వర్లు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో మంగళవారం 'వరల్డ్ సోషల్ వర్క్ డే ' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సోషల్ వర్కర్ల సామాజిక, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. సోషియాలజీ విభాగ అధ్యాపకుడు ఆచార్య త్రిమూర్తిరావు, డాక్టర్ రాజకుమార్ పాల్గొన్నారు. అధ్యాపకులను పరిశోధకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ పరిశోధకులు ఆవులయ్య, స్వరూప్ పాల్, బ్రహ్మం ఉన్నారు.

వైభవంగా ధాన్యలక్ష్మీ నారాయణుల కల్యాణం



పాత గుంటూరు: అరండల్ పేట అష్టలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయ 29వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ధాన్యలక్ష్మీ నారాయణుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్ నిర్వహణలో అభిషేకాలు, కుంకుమ పూజలు, హారతి, మంత్రపుష్పం, లలిత సహస్ర నామ పారాయణం చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకూ ఒంటిపూట ప్రకటించరూ..

మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్, రాష్ట్ర జాయింట్ డైరెక్టర్‌కు వినతిపత్రం



ప్రత్తిపాడు: ఎండలు మండుతున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా ఒంటిపూట బడులను అమలు చేయాలని కోరుతూ ఫోరమ్ ఫర్ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్- మినీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు టి.జ్యోతిరాణి కోరారు. ఈ మేరకు మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ వెత్రి సెల్వి, జాయింట్ డైరెక్టర్ మనోరంజనిలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఎండలు విపరీతంగా కాస్తుండటంతో కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలంటే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని, అందుచేత హాఫ్ డేస్ ప్రకటించాలని కోరారు. అదేవిధంగా మే నెల మొత్తం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు, మినీ సెంటరు వర్కర్లుకు వేసవి సెలవులు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.